ముచ్చర్ల రజనీ శకుంతల

కౌసల్య చాలా తెలివయినది. అప్పట్లోనే టెన్త్‌క్లాస్ ఫస్ట్ క్లాస్‌లో పాసయిందంటే, ఆమె తెలివి సామాన్యమైనది కాదు. ఒక్క చదువులోనే కాదు ఆటల్లో, పాటల్లో అన్నిటిలో ఫస్టే. అయినా ఆడపిల్ల అన్నాక పెళ్ళి చెయ్యక తప్పదు కాబట్టి, అందులోనూ అది పల్లెటూరు కాబట్టి ఆడపిల్ల పెద్దమనిష య్యిందంటే పెళ్ళికి సిగ్నల్ ఇచ్చినట్టే అర్థమని ఆ సాంప్ర దాయ, సనాతన కుటుంబం అభిప్రాయం.

కౌసల్య పెళ్ళి రంగరంగ వైభవంగా ప్రకాశరావుతో జరిగిపో యింది. దేనికే లోటు లేని జీవితం. ప్రేమగా చూసుకునే అత్త మామలు, పట్టుపాన్పు, పూలతేరుల మీద నడిపించే భర్తా. ఆమె జీవితం మూడు పువ్వులు, ఆరుకాయలు మాత్రమే కాదు మూడు పేజర్లూ, ఆరు సెల్‌ఫోన్లలా సాగిపోతోంది.

కాలక్రమంలో ముగ్గురు కొడుకులు, ఒక కూతురు పుట్టు కొచ్చారు.

కౌసల్య కాస్తా కౌసల్యమ్మగా మారింది. అయినా ఆమెలో ఠీవి, దర్పం పెరిగిందే తప్ప తగ్గలేదు. ఆమె కౌసల్య కదా మరి.

ఇంకొన్నాళ్ళు గడిచేసరికి అత్తమామలు స్వర్గస్తుల య్యారు. కాలక్రమంలో భర్త ప్రకాశరావు కూడా చనిపో యాడు. కాకపోతే అప్పటికి అందరి పెళ్లిళ్ళూ అయిపోయాయి కాబట్టి కౌసల్య పెద్ద బాధ్యతల్నుండి తప్పించుకుంది.

అల్లుడూ, ముగ్గురు కోడళ్ళు వచ్చారు కౌసల్యకి. కృష్ణా రామా అనుకుంటూ హాయిగానే ఉంటోంది కౌసల్య. పైగా ఇది వరకటి కంటె లావు అయింది. అస్తమానూ ర్త తలపులతో పడు కోవడం వలనా, వేరే బాధ్యతలూ, పనులూ ఏవీ లేకపోవడం వలన.

అటువంటి సమయంలో అనుకోని సమస్యలొచ్చి పడ్డాయి కౌసల్యకు. (కోడళ్ళొస్తే కష్టాలు, సమస్యలు నేచురల్‌గా వస్తాయి కదా!) అదే సమస్య కౌసల్యకూనూ. కోడళ్ళు రావడం బాగానే ఉంది. వాళ్ళు వస్తూ వస్తూ సమస్యల్ని కూడా తెచ్చారు.

కౌసల్యకు మనశ్శాంతి లేకుండా పోయింది ఆ ఇంట్లో. దానికి కారణం ఆమె పట్టుదల, అహంకారం. ప్రతీ పనీ తనని అడిగే చెయ్యాలి, తన మాటే నెగ్గాలీ... అదీ ఆవిడ పంతం. కోడళ్ళని మహా కంట్రోల్‌లో పెట్టుకునేది కొత్తలో కౌసల్య. కానీ రానురాను తెలివిమీరి తనని అడిగి గానీ కూర కూడా తరగని కోడళ్ళు ఇప్పుడు సినిమాకి వెళ్ళాలన్నా తనని అడగడంలేదు. ఏకంగా తయారయి వచ్చేసి, వెళ్ళే ముందు 'వెళ్తున్నాం' అని చెప్తున్నారు. ఇదివరకు సినిమాకి వెళ్ళాలంటే తన పర్మిషన్ అడిగి తీసుకున్నాకే తయారయ్యేవాళ్ళు. అది అసలు నచ్చటం లేదు కౌసల్యకు.

కోడళ్ళలో వస్తున్న మార్పును గమనిస్తూనే ఉంది. ఇలా కాదు వీళ్ళ పని అనుకుంది. తనకున్న నగల ఆశచూపి అయినా సరే కోడళ్ళని లొంగదీసుకోవాలనుకుంది.

చుట్టాలది ఎవరిదో పెళ్ళి ఫంక్షన్ వచ్చింది. పెద్ద కోడల్ని పిలిచి పెళ్ళికి వెళ్ళేటప్పుడు తన కాసులపేరు ఇచ్చి

'ఒసే... కల్యాణీ! పెళ్ళికి వెళ్ళేప్పుడు ఈ కాసులపేరు వేసుకొని వెళ్ళు. నిండుగా ఉంటుంది' అంది కౌసల్య.

తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది కల్యాణి.

'ఎందుకులెండి అత్తయ్యా! నా నెక్లెస్ వుందిగా' అంది పైకి మాత్రం.

'ఉంటే ఉందిలే. ఇది కూడా వేసుకొని వెళ్తే మరింత నిండుగా ఉంటుంది...' అంది లౌక్యంగా.

కల్యాణీకి కాసుల పేరు ఇచ్చిన దాని కంటే, మిగతా ఇద్దరు తోటికోడళ్ళకి ఇవ్వనందుకు చాలా సంతోషపడింది. 'మంచి పనయింది. అత్తగార్కి ఎలాగైనా తనంటేనే ఇష్టం' అనుకుని మురిసిపోయింది.


ఇలా కోడళ్ళ మధ్య తగవులు సృష్టించి, అందరికీ తను మంచిదయి, అందరినీ తన కంట్రోల్‌లో పెట్టుకోవాలనుకుంది కౌసల్య. అది ఆమె టెక్నిక్. వరుసగా ఆమె ప్లాన్స్‌ను అమలుచే యసాగింది.

తమకివ్వకుండా కాసులపేరు కల్యాణికి మాత్రమే ఇవ్వడం సహించలేక పోయారు మిగతా ఇద్దరు కోడళ్ళూ అయిన సౌమ్య, శిరీషలు.

పెళ్ళికి ముగ్గురూ కలిసి వెళ్ళినా ముఖాలు మాడ్చుకునే ఉన్నారు సౌమ్య, శిరీషలు. కల్యాణి మాత్రం కావాలనే పదేపదే సర్దుకుంది కాసుల పేరుని.

మూతి మూడు వంకర్లు తిప్పారు సౌమ్య, శిరీషలు. అలా వాళ్ళల్లో వాళ్ళకు యుద్ధాలు మొదలయ్యాయి ఆ ఇంట్లో.

★ ★ ★




సినిమాకు బయల్దేరారు ఓ రోజు సౌమ్య, ఆమె భర్త ఆనంద్. కౌసల్య పిలిచింది కోడల్ని.

'అమ్మా సౌమ్యా! నీ కభ్యంతరం లేకుంటే నా అల మారులో బోలెడు పట్టు చీర లున్నాయి. నీకు నచ్చింది ఏదైనా చీర తీసి కట్టుకో' అంది కౌసల్య.

సౌమ్య ఆనందానికి హద్దులు లేవు.

అక్కనీ, చెల్లినీ అడ క్కుండా తననే అడిగినందుకు పొంగిపోయింది. అత్తగారిది వైలెట్ కలర్ కంచి పట్టుచీర తీసి కట్టుకుంది. కల్యాణీ, శిరీష లు గమనించారిది. అయినా అడగలేకపోయారు. సౌమ్య మీద చెప్పలేనంత ఈర్ష్య పుట్టింది ఇద్దరికీ.

అయినా ఏం చెయ్యలేని పరిస్థితి.

వారం రోజులుగా ఆ ఇంట్లో ఆడవాళ్ళ కోల్డ్‌వార్ ఇలా జరుగుతూనే ఉంది.

శిరీషకు అరిసెలంటే చెప్పలేనంత ఇష్టం. కల్యాణి, సౌమ్య ఆ రోజు పుట్టింటికి వెళ్ళారు.

కౌసల్య వంటింట్లోకి వచ్చింది. అరిసెలు తయారుచే యడం మొదలుపెట్టింది. శిరీషని పిలిచి ఆప్యాయంగా ప్లేటులో పెట్టి అందించింది. అత్తగారి ప్రేమకి అంతవరకూ ఆమె మీద ఉన్న కోపం మరిచిపోయింది. తన కోసం తనకిష్ట మైన టిఫిన్ చెయ్యడం ఆమెకి చెప్పలేనంత ఆనందాన్ని కలిగిం చింది.

ఇలా ముగ్గురికీ మూడు రకాల పద్ధతిలో దగ్గరయిపో యింది కౌసల్య. ముగ్గురు కోడళ్ళూ ఎవరికి వారు తమలో తామే ఇలా అనుకున్నారు... 'అత్తగారు మంచిదే. కాకపోతే కాకా పట్టాలి' అనుకున్నారు ఎవరికి వారే! అదే కావాలి కౌస ల్యకు.

అత్తగారి దృష్టిలో మంచి కోడలు కావాలంటే ఆమె కిష్ట మైన పనులు చెయ్యడమే అని ముగ్గురికీ తెల్సు.

విడివిడిగా ముగ్గురికీ చెప్పింది కౌసల్య. తనని మంచిగా చూసుకుంటే తన తదనంతరం తన ఇనప్పెట్టెలో ఉన్న కాసుల పేరు, రాళ్ళ వడ్డాణం వాళ్ళకే ఇస్తానని చెప్పింది.

అప్పటి నుండీ చూడాలి. ముగ్గురికి ముగ్గురు ఒకరి కంటె మరొకరు పోటీపడి ఆమెని ప్రేమగా చూసుకొంటున్నారు.

ఉదయాన్నే లేస్తున్నారు.

అత్తగారికి కాఫీ తామే ముందు ఇవ్వాలన్న పట్టుదలతో ఏడుగంటలకు గానీ లేవని కోడళ్ళు ఇప్పుడు తెల్లవారుఝా ముకే లేస్తున్నారు.

ఒకరు కాఫీ ఇస్తే, మరొకరు బోర్నవిటా తెస్తున్నారు. మరొ కరు హార్లిక్స్ తెస్తున్నారు.

తొమ్మిదిన్నర అయినా టిఫిన్ పెట్టని కోడళ్ళు ఇప్పుడు రక రకాల వెరైటీస్ చేసి ఎనిమిదికే రెడీ చేస్తున్నారు.

ఒక్క కూర వేసి అన్నం వడ్డించే కోడళ్ళు రెండు రకాల కూరలు, రెండు రకాల పచ్చళ్ళూ చేస్తున్నారిప్పుడు. టైమ్ ఎంతయినా సరే కంపల్సరీగా స్వీట్ చేస్తున్నారు.

ఇలా తెల్లవారింది మొదలు కోడళ్ళ ప్రేమలో ఆవిడ ఉక్కి రిబిక్కిరి అయిపోతోంది.

కాసులపేరు నాకే రావాలని కల్యాణీ, తెల్లరాళ్ళ వడ్డాణం అత్తగారి దగ్గర్నుండి తనే సంపాదించాలని సౌమ్య, మొత్తం రెండూ తనే నొక్కెయ్యాలని శిరీష తెగ తాపత్రయ పడిపోతు న్నారు.

అప్పుడే ఆ వస్తువులు వాళ్ళ వశమై పోయినట్టు ఈస్ట్‌మన్ కలర్‌లోనూ, ఎ.ఆర్.రెహమాన్ సంగీతంలోనూ స్విట్జర్లాండ్ వెళ్ళిపోయినట్టు తమ అభిమాన హీరోతో డ్యూయెట్ పాడినట్టు తెగ కలలు కనేస్తున్నారు. మరి కాసులపేరంటే మాటలా. సుమారు నలభై తులాలుంటుందది. ఇక తెల్లరాళ్ళ వడ్డాణం యాభై తులాలకి తక్కువుండదు. ఈ రోజుల్లో అంత దిట్టంగా ఎవ్వరూ చెయ్యలేరు. ఆ కాలంనాటిది కనుక అలా వున్నా యవి.

మొత్తానికి కౌసల్య పని హాయి అయింది.

కేవలం తిండి దగ్గరే కాదు, మధ్యాహ్నం అత్తగార్కి కాళ్ళు వత్తడం, అది చూసి రాత్రికి శిరీష నడుం పట్టడం, ఇవన్నీ చూసి సౌమ్య తెల్లారగానే అత్తగారి పూజకు పూలు కోసం తేవడం చేస్తోంది.

ఇలా మొత్తానికి కౌసల్య బతుకు మూడు పువ్వులూ, ఆరు కాయలుగా సాగిపోతోంది.

అత్తగారికి ఇష్టమైన టిఫిన్స్ అడిగి మరీ చెయ్యడం, ఆవిడ కిష్టమైన కర్రీస్ వండటం, ఆవిడ్ని సినిమాలకీ, షికార్లకీ కూడా తిప్పేస్తున్నారు.

కౌసల్య తనలో తను నవ్వుకుంది.

ఇవన్నీ ఆలోచించే అనుకుంటా తన భర్త డబ్బు ఎంత అవసరమైనా ఏనాడూ తన వస్తువుల్ని తాకట్టుకో, మరి దేనికో అడిగేవాడు కాదు. బిజినెస్‌లో కూడా అప్పుడప్పుడూ అవాంతరాలు వచ్చినా మరో దారి చూసుకున్నాడే తప్ప ఏనాడూ తన సొమ్ములు అడిగేవాడు కాదు. అవే లేకుంటే ఈ రోజు తనీ స్థితిలో వుండేది కాదు.

మొత్తానికి అత్తగారు కౌసల్య మంచి హోదాలో సుఖపడిపోతోంది. అది మాత్రం నిజం.

వయసుపైబడుతున్న కొద్దీ ఏదో ఒక జబ్బులు రావడం సహజమే.

కౌసల్యకి బి.పి. వచ్చింది. డాక్టర్ ఉప్పు తగ్గించమన్నాడు. మాత్రలు క్రమం తప్పక వాడాలన్నాడు.

దగ్గరుండి మరీ ప్రేమగా మందులందిస్తున్నారిప్పుడు టైం ప్రకారం కోడళ్ళు.

కూరలు ఉప్పు లేకుండా కూడా స్పెషల్‌గా వండుతున్నారు.

అయినా రాన్రాను కౌసల్య ఆరోగ్యం క్షీణించసాగింది.

దానికి తోడు సుగర్ కూడా కంట్రోల్ తప్పింది. రాత్రులు గోధుమ రవ్వ మాత్రమే తినమని డాక్టర్ చెప్పాడు.

ప్రత్యేకంగా ఆవిడకి విసుక్కోకుండా గోధుమరవ్వ ఉప్మానే చేస్తున్నారు.

స్వీట్స్ తినొద్దని ప్రేమగానే వారిస్తున్నారు.

సుగరూ, బి.పి. రెండూ ఉంటే ఎంత కష్టమో వివరించి చెప్పారు కోడళ్ళు ముగ్గురూ. ఆరోగ్య విషయంలో చాలా కేర్‌ఫుల్‌గా ఉండాలన్నారు.

కౌసల్యకి వొంట్లో బాగోలేదని తెల్సి కూతురు సువర్ణ విజయవాడ నుంచి వచ్చింది.

తల్లిని చూసి ఒక్కుదుటున ఏడ్చేసింది.

'నాకేం కాలేదే. వయసు పైబడితే ఇవన్నీ మామూలే. మీ వదినలు నన్ను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు. దేనికి ఏడుస్తావ్ చెప్పు' అంటూ కూతురు సువర్ణని మందలించింది కౌసల్య. అయినా తల్లి మీద ప్రేమతో ఏడుస్తూనే ఉంది సువర్ణ.

ఆడపడుచుని ఓదార్చారు అన్నయ్యలూ, వదినలూ. తను చేసేదేం లేకున్నా అన్నయ్యలందర్నీ డామినేటింగ్‌గా ప్రశ్నించింది. మంచి డాక్టర్‌కి చూపిస్తున్నారా? మందులు కాస్ట్లీ అని మానేస్తున్నారా? లేక సరిగ్గా వేస్తున్నారా?' అంటూ తనకే ప్రేమున్నట్టు అడిగే సరికీ అందరికీ ఒళ్ళు మండింది.

పోనీ, అమ్మని కొన్నాళ్ళు నువ్వు తీసుకెళ్ళు. కాస్త స్థలం ఛేంజ్‌గా ఉంటుందన్నారు. పోనీ అక్కడే మరో పెద్ద డాక్టరుంటే చూపించమన్నారు.

'అదెలా కుదురుతుంది. మాది జాయింట్ ఫ్యామిలీ. అందరూ ఏమనుకుంటారు. అమ్మని ఎవరు డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి. బావగారు బిజీ అయ్యే...' అని తప్పించుకుంది.

'అయినా నేనిక్కడే ఉంటాన్లే. నాకేం ఫర్లేదు. నాకేం లోటు చెప్పు. మనవలూ, మనవరాళ్ళూ... కొడుకులూ, కోడళ్ళూ... అందరూ ఇక్కడున్నారు. నాకేం లోటు ఇక్కడ. అయినా నేనిపుడు హాయిగానే ఉన్నాను. నువ్వేం దిగులుపడకు. నా గురించి ఎక్కువ ఆలోచించకు' అంది ఆ తల్లి.

సువర్ణ మనసు కుదుటపడింది.

★ ★ ★

రాత్రి పదయింది.

అందరి భోజనాలూ అయ్యాయి.

ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

సువర్ణ తల్లి దగ్గరే పక్కన చేయి వేసుకొని పడుకుంది.

'అమ్మా! ఇప్పుడు చెప్పవే. నిజంగా అన్నయ్య, వదినలు నిన్ను బాగానే చూసుకుంటున్నారా? ఏం లోటు చెయ్యట్లేదు కదా' ఆరాగా అడిగింది సువర్ణ.

'అందరూ బాగానే చూసుకుంటున్నారే. చూడకపోవడానికి నేను మామూలు తల్లిని కాదు కదా...' అంది నవ్వుతూ.

'అదేమిటే...'

'అంతే మరి' అంటూ కాసుపేరు, వడ్డాణం సంగతి చెప్పింది నవ్వుతూ.

'అయితే మొత్తానికి అందరూ నీ చుట్టూ తిరుగుతున్నారన్న మాట'

'ఆ! అవున్నంతకాలం నాకే ఢోకాలేదు'

'అద్సరేగానీ అమ్మా! అవి రెండూ ఎవరికిస్తావే నిజంగా' అంది ఆరాతీస్తూ సువర్ణ.

'పిచ్చిదానా! ఇంకెవరికిస్తానమ్మా! నా కూతురివి నువ్వు. నీకే ఇస్తాను. ఎంత బాగా చూసినా వాళ్ళు నా కోడళ్ళు. వాళ్ళకెలా ఇస్తాను చెప్పు...'

'హమ్మయ్య' అని తృప్తిగా నిట్టూర్చింది సువర్ణ. కానీ కౌసల్యకి కూడా తెలియని నిజం ఒకటుంది. అది ఆమె భర్తకే తెలుసు. ఎందుకంటే వెండికి గోల్డ్ కోటింగ్ వేయించింది అతనే కాబట్టి. ★

## సముద్రంలో జీవనం

1965లో ఫ్రాన్స్‌కు చెందిన జాక్వస్, కౌస్తెయు సముద్రగర్భంలో 80 అడుగుల లోతున కొంతమంది డ్రైవర్ల జట్టుతో కలిసి వారం రోజులు గడిపాడు. అంతకు ఎన్నో శతాబ్దాల క్రితం అలెగ్జాండర్ నీటిలోపల గాజు స్థూపంలో కూర్చుని జల చరాలను పరిశీలించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి. దీనినిబట్టి మానవుడు ఏకంగా సముద్రంలోనే జీవించవచ్చు అన్న ఊహ కలగకపోదు.

## నిద్ర కొలిచే సాధనం

కంటి పరంగా నిద్రను రెండు రకాలుగా చెబుతారు. నిద్రలో కంటిని ఎక్కువగా తిప్పుతూ వుండటాన్ని 'రెమ్' (ఆర్ఇఎం) అని, కంటిని కదపక నిద్రించటాన్ని 'నెరెమ్' (ఎన్ఆర్ఇఎం) అని అంటారు. నిద్ర అధ్యయనం చేసే పరికరాన్ని 'ఎలక్ట్రో ఎన్.సి. పాలోగ్రామ్' అని అంటారు.

## చికిత్స

రోగుల చికిత్సకు మొక్కల వేళ్ళు, ఆకులు, కాండాల కంటే ఇనుము, పాదరసం, గంధకానికి సంబంధించిన ఖనిజాలు బాగా పనిచేస్తాయని చెప్పిన శాస్త్రవేత్త ఫిలిఫస్ ఆరియోలస్ పారాసిలసస్.

## డిఫరెంట్ థాట్స్

మనం భూమి నుంచి చూసినప్పుడు ముద్దగా శ్వేత అంబరంలానూ, ఒక పాల ప్రవాహం ఆకాశంలో ప్రవహిస్తున్నట్టు కనిపిస్తుంది. పాలపుంత మధ్య నుంచి ఒక చక్రం ఆకారంలో కాంతివంతమైన పట్టీ అది. దీనినే ప్రపంచ దేశాలలోని ప్రజలు రకరకాలుగా భావిస్తారు. మధ్య ఆసియాలో కొందరు దీనిని దేవుడి పాదాలని, చైనా వారు విశ్వ నదీ ప్రవాహమని, హెబ్రూలు ఒక కాంతిపుంజ ప్రవాహమనీనూ, గ్రీకుల అభిప్రాయంలో స్వర్గానికి నిచ్చెనలని భావిస్తారు. మన భారత సంస్కృతిలోనైతే ఆకాశ గంగ నేలకి దిగుతున్న స్వరూపమని, ఉత్తర దక్షిణ పుణ్యతీర్థాల మధ్య దేవతలు ప్రయాణించే మార్గం అని రకరకాల భావిస్తారు.

-శాలిని

